


హౌస్ వైరింగ్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

ధవళేశ్వరంలోని ఆల్కట్ గార్డెన్స్ సమీపంలో ఉన్న ఇండియన్ బ్యాంక్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో హౌస్ వైరింగ్, గృహోపకరణాల మరమ్మతులపై శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని సంస్థ డైరెక్టర్ తాడి శ్రీనివాసరావు తెలిపారు. పదోతరగతి, పాస్, ఫెయిల్ అయిన గ్రామీణ యువకులకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. 18 ఏళ్ల నంచి 45 ఏళ్లలోపు యువకులు అర్హులన్నారు. 30 రోజులపాటు శిక్షణ ఉంటుందని, శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వాసులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం 9440414910, 8555988580, 0883-2428807 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని గ్రామీణ యువత సద్వినియోగం చేసుకోవాలనిసూచించారు.

మోత మోగుతున్నాయి

- పెరుగుతున్న శబ్ద కాలుష్యం
- ఆందోళన కలిగిస్తున్న బైక్ హారన్స్
- కొరడా ఝుళిపిస్తున్న పోలీసు శాఖ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పట్టణ కేంద్రాల్లో జనావాసాల మధ్య వాహనాల శబ్దం హద్దులు మీరుతోంది. కొంతమంది యువత విచిత్ర హారన్లను వినియోగించడంతో జనం బెంబేలెత్తిపోతున్నారు. ద్విచక్ర వాహనాల నుంచి ఆటోల వరకు కొందరు ఆకతాయిల చేష్టలవల్ల ప్రజలు హడలెత్తిపోతున్నారు. పిల్లి అరుపు నుంచి పిల్లాడి ఏడుపు వరకు.. కుక్క మొరిగినట్టు, నక్క మూలిగినట్టు, పులి గాండ్రించినట్టు ఇలా ఒకటేంటి రకరకాల హారన్‌లు, విసిగిపోయే సైరన్లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. నిత్యం జనం రద్దీగా ఉండే ప్రాంతాల్లో విచిత్రమైన శబ్దాలు చేస్తూ జనాన్ని విసిగిస్తున్నారు. జనంలో బుల్లెట్‌పై మక్కువ తెలిసిందే. వాస్తవానికి బుల్లెంట్ బండి కంపెనీతో వచ్చే సైలెన్సర్‌లో శబ్దస్థాయి చాలా తక్కువగా ఉంటుంది. కానీ వాటిని కొనుగోలు చేసినవారిలో చాలామంది తర్వాత భారీ శబ్దం వచ్చే సైలెన్సర్‌లు అమర్చుతున్నారు. వాహనాల నుంచి పరిశ్రమల వరకు శబ్దానికి సంబంధించి పరిమితులు ఉన్నప్పటికీ అధికారులు వాటిని పట్టించుకోకపోవడం, ప్రజల్లో సరైన అవగాహన లేకపోవడంతో ఎవరికి వారు ఇష్టారీతిన శబ్దకాలుష్యానికి కారకులుగా మారుతున్నారు.పర్యావరణ పరిరక్షణ నిబంధనల ప్రకారం ప్రతి వాహనానికి పలు పర్యావరణ నిబంధనలు ఉన్నాయి. 1986 పర్యావరణ నిబంధనల ప్రకారం ద్విచక్రవాహనం నుంచి ట్రాక్టర్ వరకు ప్రతి మోటారు వాహనానికి శబ్ద నాణ్యతా ప్రమాణాలు పాటించాల్సిందే. సైలెన్సర్ తప్పనిసరిగా ఉండాలి. వాహనం తీసుకున్న ఆరు నెలల వరకు 90 డెసిబుల్స్ బైస్టాండర్స్ పోజిషన్, 100 డెసిబుల్స్ ఆపరేటర్ లెవల్స్ ఉండాలి. రెండున్నర సంవత్సరాల తర్వాత 88 డెసిబుల్స్ బైస్టాండర్స్ పొజిషన్, 98 డెసిబుల్స్ ఆపరేటర్ లెవెల్స్ ఉండాలి. కానీ కొందరు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా వాహనాలకు సైలెన్సర్లు మారుస్తూ శబ్ద కాలుష్యానికి కారకులవుతున్నారు. హారనలు మార్చి సైరన్‌లు మోగిస్తున్నారు.

కొందరు ఆటోవాలాలు తమకు నచ్చిన హారన్ వాడుతున్నారు. అంతేకాకుండా కొందరు ఆటోవాలాలు నిబంధనలకు విరుద్ధంగా తమ ఆటోల్లో మూజిక్ స్పీకర్లు ఏర్పాటు చేసి ప్రజలకు చుక్కలు చూపిస్తున్నారు. అదేవిధంగా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో జనవాసాలు మధ్యనే కొన్ని పరిశ్రమలు నిర్వహిస్తున్నారు. వాటినుంచి వచ్చే శబ్దాలతో ఆయా ప్రాంతాల్లోని గహాల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సదరు పరిశ్రమల నిర్వాహకుల నుంచి కొందరు అధికారులకు మామూళ్లు వెళ్తున్నాయని, అందువల్లనే అలాంటివాటిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో సైలెన్సర్లపై సీరియస్ నోట్ ప్రకటించిన అధికారులు వాటిపై పలుమార్లు స్పెషల్ డ్రైవ్ చేపట్టేవారు. శబ్దానికి హద్దులు లేని వాహనాలను సీజ్ చేయడంతోపాటు జరిమానాలు విధించడం చేసేవారు. మరికొన్ని సార్లు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేవారు. అలా గతంలో ఒకరోజు 50కి పైగా ద్విచక్రవాహనాలను సీజ్ చేసిన ఘటనలూ ఉన్నాయి. శబ్ద కాలుష్యం కారణంగా గుండె కొట్టుకునే వేగం, రక్తప్రసరణ వేగం పెరుగుతుంది. 65 డెసిబుల్స్ దాటిన శబ్దం వింటే గుండెజబ్బులు వస్తాయి. గుండెపోటుకూడా రావచ్చు.పనిచేసే శక్తిని కోల్పోతాం. చెవుడు కూడా వస్తుంది. నిద్రపట్టదు, తలనొప్పి, అలసిపోతాం.మానసికంగా, శారీరకంగా మనిషిని కుంగదీస్తుంది. వాహనాల వారీగా వచ్చే శబ్దాల స్థాయి వాహనం శబ్దస్థాయి(డెసిబుల్స్‌లో)మోటారు వాహనాలు త్రీవీలర్స్ 80పాసింజర్, కార్లు 82పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 ఎంటీ వరకు) 85పాసింజర్, కమర్షియల్ వాహనాలు(4 నుంచి 12ఎంటీ వరకు) 89పాసింజర్, కమర్షియల్ వాహనాలు(12 ఎంటి కంటే ఎక్కువ) ఉండాలి. 91 రాష్ట్ర పోల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిబంధనల ప్రకారం ప్రాంతాల వారీగా శబ్దం ఉండాల్సిన డెసిబుల్ స్థాయి...పారిశ్రామిక ప్రాంతంలో 75.00 నుంచి 70.00 ఉండాలి. వాణిజ్య ప్రాంతంలో 65.00 55.00 డెసిబుల్స్ ఉండాలి. నివాసప్రాంతంలో 40.00 నుంచి 55.00 ఉండాలి. నిశబ్ద ప్రాంతం 50.00 40.00 లోపు ఉండాలి.



నిబంధనలు పాటించిన బైకులు, ఇన్‌సెట్‌లో తొలగించిన సైలెన్సరు

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి శబ్ద కాలుష్యం చేస్తున్న 20 బుల్లెట్ వాహనాలను గుర్తించాం. ఆయా వాహనాల సైలెన్సర్లను వాహనదారుల ద్వారానే తొలగించాము. మోటార్ వాహన చట్టం యుఎస్ 190(2) ప్రకారం జరిమానా విధించాం. ప్రతి రోజూ డ్రైవ్ నిర్వహిస్తాము. వాహనదారులతో పాటు అధిక శబ్ధము వచ్చే సైలెన్సర్లను బిగించిన మెకానిక్ షాపులపైనా చర్యలు తీసుకుంటాము. కావున పోలీసు శాఖ వారికి సహకరించండి. అధిక శబ్ధములు వచ్చే సైలెన్సర్లను నియంత్రించండి.

- కె. వెంకటేశ్వర్లు, డిఎస్‌పి ట్రాఫిక్



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తునన మున్సిపల్ కార్మికులు

కలెక్టరెట్ వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

మున్సిపల్ కాంట్రాక్ట్ వుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె 14వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. యూనియన్ అధ్యక్షులు భూపతి రవీంద్ర అధ్యక్షతన జరిగిన సమావేశంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం.సుందరబాబు మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పనిచేసే మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయకుండా ప్రభుత్వం పట్టుదలకు పోవడం సరికాదన్నారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి రాష్ట్ర ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కార్మికులకు వేతనాలు ఇచ్చేందుకు డబ్బులు లేవని చెప్పడం దారుణమన్నారు. మాట తప్పను మడమ తిప్పను అంటూ ఇచ్చిన హామీని నేడు మరువడం శోచనీయమన్నారు. నాయకుడు మీసాల కిషోర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులను వైసిపి ప్రభుత్వం మరోమారు మోసం చేస్తుందన్నారు. ఏ ఒక్క కార్మికునికీ కనీస వేతనం అమలు కావట్లేదన్నారు. రాజన అప్పారావు మాట్లాడుతూ చెవిటివాని ముందు శంఖం ఊదినట్టు ప్రభుత్వం తీరుందన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి పూజారి వాసు, కోశాధికారి కళ్యాణ్ రాజేష్, మీసాల ప్రేమ్, కారంకి ప్రసాద్, ముత్యాల శ్రీను, వడ్డాది శ్యామ్, అల్లం విజయకుమార్, మీసాల శివశంకరజ్యోతి, మీసాల వరలక్ష్మి, పి.మాధవ్ తదితరులు నాయకత్వం వహించారు. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతు తెలిపారు.

వివిధ శాఖలపై జెసి సమీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

సోమవారం సాయంత్రం స్థానిక జెసి ఛాంబర్‌లో తొమ్మిది శాఖల అధికారులతో జెఇ ఎన్.తేజ్‌భరత్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. దీర్ఘ కాలికంగా జిల్లా పరిధిలోని 15 శాఖలకు చెందిన 79 ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూంలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇప్పటికే ఆయా శాఖలకు వివరాలు తెలియజేశామన్నారు. ఇరిగేషన్ 28, ఎసిబి 13, పోలీస్ 13, పంచాయతీ రాజ్ 6, రెవెన్యూ 5, ప్రిజన్స్ 2, గిరిజన సంక్షేమ 2, సిఐడి 3, ఆర్ అండ్ బి, సమాచార శాఖ, విజిలెన్స్, దేవాదాయ, ట్రెజరీ, జ్యుడీషియల్ శాఖలకు చెందిన ఒకొక్కటి ఆర్టికల్స్ స్ట్రాంగ్ రూంలో ఉన్నాయని తెలిపారు. నాలుగు అంశాల వారీగా ఆర్టికల్స్ ఎంతకాలం నుంచి, స్టాంప్స్, చెక్ బుక్స్ వారీగా సమగ్ర నివేదికను సిద్ధం చేశామన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఒ జి.నరసింహులు, జిల్లా ట్రెజరీ అధికారి ఎస్.సత్యనారాయణ, సహాయ ట్రెజరీ అధికారి కె.వినోద్, అదనపు ఎస్‌పి ఎల్.చెంచురెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ కె.ఆనందరావు, ఎండోమెంట్ ఎఇ వి.సోమశేఖర తదితరులు పాల్గొన్నారు.


నూతన కార్యవర్గంతో రాష్ట్ర అధ్యక్షులు కుమార్ తదితరులు

'మెడికల్' రంగంలో కనీస వేతనాలు కరువు

ఎపిఎంఎస్‌ఆర్‌యు రాష్ట్ర అధ్యక్షులు కుమార్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మెడికల్, సేల్స్ రంగంలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు చెల్లించట్లేదని ఆంధ్రప్రదేశ్ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కుమార్ అన్నారు. రాజమహేంద్రవరం శాఖ వార్షిక సర్వ సభ్య సమావేశం ఎపిఎన్‌జిఒ హాల్లో జరిగింది. దీనికి కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్‌పిఇ యాక్ట్‌ని అమలు చేయట్లేదన్నారు. దీని కోసం పోరాటం చేయాలన్నారు. ఫిబ్రవరిలో జరిగే ఎఫ్ఎంఆర్ఎఐ జనరల్ కౌన్సిల్ ఆల్ ఇండియా సమావేశాలు, ఎపిఎంఎస్ఆర్‌యు జనరల్ కాన్ఫరెన్స్‌ను జయప్రదం చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి ఎన్.సత్తిరాజు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఐక్యంగా తిప్పికొట్టాలన్నారు. కార్మిక చట్టాలను మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకంచారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జిలాని, ఎఐఐఇయు నాయకులు పిఎస్ఎన్.రాజు పాల్గొన్నారు. అనంతరం కొత్త నాయకత్వాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎంవివి.సత్యనారాయణ, రణదీప్ సింగ్ అధ్యక్ష కార్యదర్శులుగా, జెవి.గోపాలకృష్ణ కోశాధికారిగా, ఖాదర్, సత్తిబాబు, రాంబాబు, రామగణేష్ సహాయ అధ్యక్ష, కార్యదర్శులుగా, 16 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో రామారావు, మూర్తి, దానేశ్వర రావు, లవకుమార్, సురేష్, శాస్త్రి, అలీ, చందు, బాలకృష్ణ, శ్రీధర్ పాల్గొన్నారు.

ఎస్మా ఎత్తేయాలి... వేతనాలు పెంచాలి

కొనసాగుతున్న అంగన్‌వాడీల సమ్మె

పలుచోట్ల ఎస్మా ప్రతుల దహనం


ప్రజాశక్తి - యంత్రాంగం

ఎస్మాను రద్దు చేయాలని, వేతనాలు పెంచాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేస్తున్నారు. వారు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 28వ రోజుకు చేరింది. రాజమహేంద్రవరంలో 24గంటల నిరవధిక ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు ఎస్ఎస్.మూర్తి ప్రారంభించారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని అమలు చేయాలన్నారు. మాట తప్పను మడమ తిప్పనన్న ముఖ్యమంత్రి హామీలను నెరవేర్చడంలో మాట తప్పి మడమ తిప్పారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 రోజులుగా లక్ష మందికి పైగా అంగన్వాడీలు ఆందోళనలు చేస్తున్నారన్నారు. వారితో మాట్లాడే సమయం లేకపోవడం బాధాకాం మన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి సిహెచ్.మాణిక్యంబ, కె.బేబిరాణి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, జిల్లా కోశాధికారి కెఎస్‌వి.రామచంద్రరావు, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జువ్వల రాంబాబు, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రాజా, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు పాల్గొన్నారు. **చాగల్లులో** తహశీల్దార్ కార్యాలయం వద్ద సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. పి.విజయకుమారి, కె.లక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పి.విజయకుమారి, కె.లక్ష్మి, కె.దమయంతి, ఎ.శ్రీదేవి, బి.మహాలక్ష్మి, ఎస్.అరుణకుమారి పాల్గొన్నారు. **కడియంలో** అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా ఎస్మా ప్రతులను అంగన్‌వాడీలు దహనం చేశారు. రాజానగరం ప్రాజెక్ట్ లీడర్ సుజాత మాట్లాడారు. ఎన్ని జిఒలు ఇచ్చినా, అణచివేయాలని చూసినా ఉద్యమం ఆగదన్నారు. **రాజానగరంలో** అంగన్‌వాడీలు, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఎస్మా జిఒ ప్రతులను దహనం చేశారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షులు జె.సత్తిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎం.మార్తమ్మ, పిఎల్.మాధురి తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడిలో** సమ్మెను కొనసాగించారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న రిలే దీక్షల శిబిరం వద్దకు మద్దతుగా వెళ్లారు. **గోకవరంలో** తహశీల్దార్ కార్యాలయం సమీపంలో సమ్మె శిబిరాన్ని కొనసాగించారు. ఎస్మా ప్రతులను దహనం చేశారు. హామీలు అడుగుతుంటే అణచివేతకు పాల్పడటం తగదన్నారు. ఈ కార్యక్రమంలో అధికసంఖ్యలో అంగన్‌వాడీలు పాల్గొన్నారు. **దేవరపల్లి** బస్టాండ్ సెంటరల్‌లో జిఒ ప్రతులను దమనం చేశారు. సిఐటియు మండల కార్యదర్శి భగత్ మాట్లాడారు. అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అంగన్‌వాడీలపై ఒత్తిడి తేవడం తగదన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ సలహాదారులకు లక్షల్లో జీతాలు ఇవ్వడానికి ఉన్న డబ్బులు అంగన్‌వాడీ వర్కర్లకు వేతనాలు ఇవ్వడానికి ఎందుకు లేవన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.రత్నాజీ, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు టిపి.లక్ష్మి, ఎ.పద్మకామేశ్వరి, కె.బలుసుకుమారి, కె.వరలక్ష్మి, కె.దేవిసావిత్రి, టి.సంధ్య తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురంలో** అంగనవాడీల సమ్మెకు యుటిఎఫ్, ఎపిటిఎఫ్ నాయకులతో పాటు పలు ప్రజాసంఘాల నాయకులు హాజరై మద్దతు తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘ నాయకులు ఎ.జానుబాబు, కె.శ్రీనివాసరావు, జి.వెంకటేశ్వరరావు, బోడ వెంకటలక్ష్మి, సనపల రాజశేఖర్, ఎం.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరంలో శిబిరంలో మాట్లాడుతున్న మూర్తి


దేవరపల్లిలో ఎస్మా ప్రతులను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

కార్టూ'నిజం'



ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో సంక్రాంతి సంబరాలను వివిధ స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థల్లో సోమవారం ఉత్సాహంగా నిర్వహించారు. **నిడదవోలులో** వాసవి ఆర్యవైశ్య సేవా సంఘం అధ్యక్షులు కేదారిశెట్టి రవికుమార్ అధ్యక్షతన సంక్రాంతి సంబరాల్లో భాగంగా ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు ముఖ్య అతిథి, సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు కేదారిశెట్టి వెంకటేశ్వరరావు చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కేదారిశెట్టి నెహ్రూ, ట్రెజరర్ వి.సుబ్బారావు, మహిళా విభాగ ప్రెసిడెంట్ కేదారిశెట్టి పద్మిని, కార్యదర్శి కేదారిశెట్టి సునీత, ట్రెజరర్ జయవరపు లక్ష్మీ సుభద్ర, కేదారిశెట్టి శ్రీహరి కుమార్, కంకిపాటి వెంకటేశ్వరరావు, కేదారిశెట్టి కాశీ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు. **రాజమహేంద్రవరంలో** 25వ డివిజన్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడారు. 42 డివిజన్లో సంక్రాంతి సంబరాలు నిర్వహించి విజేతలకు సంక్రాంతి రోజున బహుమతులు అందిస్తామన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ప్రజలకు అందజేసిన సంక్రాంతి కానుకలను నిలిపివేయడం హేయమైన చర్య అన్నారు. రాష్ట్రంలో గత వైభవం రావాలంటే టిడిపిని అధికారంలోకి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షులు రెడ్డి మణేశ్వరరావు, వాణిజ్య విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షులు తవ్వ రాజా తదితరులు పాల్గొన్నారు. రాజా సమకూర్చిన సమకూర్చిన కిట్లను 300 మందికి అందించారు. **గోపాలపురం** మండలం రాజంపాలెం జడ్‌పి ఉన్నత పాఠశాలో హెచ్ఎం సంపూర్ణ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సర్పంచ్ కరుకూరి ధనలక్ష్మి హాజై మాట్లాడారు. అంతరించిపోతున్న మానవ విలువలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. విద్యార్థుల సంప్రదాయ వేషధారణ, ముగ్గుల పోటీలు, భోగిమంటలతో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పిఎంసి చైర్మన్ వలిభాషా, ఉపాధ్యాయులు వెంకటరామయ్య, నాగేశ్వరరావు, గంగరాజు, పీడీ హేమలత, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల్లో దాగివున్న కళల నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు వివిధ పోటీలను నిర్వహిస్తున్నామని కరస్పాండెంట్ వివి.అనీష్ అన్నారు. పాఠశాలలోనీ మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులకు ముగ్గులపోటీలను నిర్వమించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** మండలంలోని కె.సావరం గోల్డెన్ కిడ్స్ పాఠశాలలో సోమవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారీ సెట్టింగులు మధ్య అచ్చ తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. **దేవరపల్లి** భాష్యం స్కూల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి,పతంగుల పోటీలలో పాల్గొని గొబ్బెమ్మల చుట్టూ పాటలు పాడుతూ నర్తించారు. ప్రిన్సిపల్ పి.పేరయ్యనాయుడు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తెలియజేయడానికి ఇలాంటి పండుగలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో చాంప్స్ ప్రిన్సిపల్ షేక్ షబానా, ఉపాధ్యాయులు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.


గోపాలపురం రాజంపాలెం జడ్‌పి పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

అర్జీలను వేగంగా పరిష్కరించాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

స్పందనలో వచ్చిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా వేగంగా పరిష్కరించాలని జెసి ఎన్.తేజ్‌భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందనలో డిఆర్‌ఒ జి.నరసింహులు, టూరిజం ఆర్‌డి వి.స్వామినాయుడు, ట్రైనీ ఎస్‌డిటిలు సువర్ణ, భాను ప్రకాష్‌లతో కలిసి ఆయన అర్జీలను స్వీకరించారుర. ఈ సందర్భంగా జెసి మాట్లాడారు. 226 అర్జీలను స్వీకరించామన్నారు. ఆన్ లైన్ 171 ఆఫ్ లైన్ 55 వచ్చాయన్నారు. ఆయా శాఖలకు వాటిని బదిలీ చేశామన్నారు. స్పందనలో ప్రజల నుంచి అందిన అర్జీల్లో కడియం, వేమగిరి గ్రామాల్లో ఇంటి స్థలం కేటాయింపు జరిగినా, అధికారులు స్థలాన్ని చూపడం లేదని అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.దినేష్‌కుమార్, డిఆర్‌ఒ జి.నరసింహులు, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామి నాయుడు, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్లు ఎం.భానుప్రకాష్‌రెడ్డి, పి.సువర్ణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డిసిహెచ్‌ఒ డాక్టర్ ఎం.సనత్ కుమారి, సిపిఒ ఎల్.అప్పలకొండ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.మాధవరావు, డ్వామా పీడీ పి.జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

బలమైన రైతాంగ ఉద్యమం అవసరం

ఎఐకెఎస్ జాతీయ అధ్యక్షులు వెంకయ్య

రైతు సంఘం రాష్ట్ర మహాసభ ప్రారంభం



ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, రైతులు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని అఖిల భారత కిసాన్ సభ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య పిలుపునిచ్చారు. దేనికి తలవంచని జగమొండి మోడీని మెడలు వంచిన ఘనత ఢిల్లీ రైతు ఉద్యమానికి దక్కుతుందన్నారు. అదే స్ఫూర్తితో విద్యుత్ సంస్కరణలు అమలుకు వ్యతిరేకంగా, గిట్టుబాటు ధర కోసం రైతాంగం బలమైన ఉద్యమానికి సిద్ధం కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర 18వ మహాసభ సోమవారం రాజమహేంద్రవరంలో ప్రారంభమైంది. తొలుత స్థానిక మున్సిపల్ స్టేడియం నుంచి మహాసభ ప్రాంగణం వరకూ ప్రదర్శన జరిగింది. అనంతరం కొల్లి నాగేశ్వరరావు ప్రాంగణం, వైవి.కృష్ణారావు, చంద్రప్పన్ వేదికల్లో మహాసభ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన రావుల వెంకయ్య హాజరై మాట్లాడారు. నల్ల చట్టాలపై ఢిల్లీ రైతాంగ పోరాటం ప్రపంచానికే ఆదర్శంగా నిలబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యుత్ సంస్కరణలను ఆగమేఘాలపై అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యుత్సాహం చూపుతోందన్నారు. బిజెపి పాలిత ఉత్తర్ ప్రదేశ్ కూడా దీన్ని వ్యతిరేకించిందన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా కన్వీనర్, వ్యవసాయ శాఖ మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ స్వామినాథన్ సిఫార్సులు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. రైతాంగానికి చులకనగా చూడటం భావ్యం కాదన్నారు. 40 శాతం మంది రైతులు అప్పులు తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. తొలుత రైతు సంఘం సీనియర్ నాయకులు కేశవ శెట్టి జెండా ఆవిష్కరించారు. మహాసభకు అధ్యక్ష వర్గంగా రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రయ్య, గాలి చంద్ర, రాష్ట్ర నాయకులు సంపన్న గౌడ్, మల్లికార్జున లక్ష్మీ సుబ్బారావు వ్యవహరించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు, జట్లు సంఘం అధ్యక్షులు కొండ్రపు రాంబాబు, సిపిఐ నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రెండు బైకులు ఢీకొని ఇద్దరు మృతి

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

రెండు బైకులు ఢీకొని సోమవారం ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మండలంలోని వడ్లమూరుకు చెందిన పెదిరెడ్డి సతీష్ (19), కె.గంగవరం మండలం ఎండగండికి చెందిన కవలి త్రిమూర్తులు (32) సోమవారం రాత్రి బైకులపై ఎదురుగా ప్రయాణిస్తూ నల్లూరు- కాలేరు రహదారి మధ్య ఢీకొన్నారు. ఈ సంఘటనలో తలకు తీవ్ర గాయమైన త్రిమూర్తులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాల పాలైన సతీష్‌ను 108లో మండపేట ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందారు. త్రిమూర్తులు వివాహితుడు. ఈ ఘటనపై విచారణ చేపట్టినట్లు అంగర ఎస్ఐ చంటి తెలిపారు.

పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలపై దాడులు

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని రాజపూడి గ్రామంలోని అక్రమ బియ్యం వ్యాపారస్తులపై విజిలెన్స్, సివిల్ సప్లయి అధికారులు సంయుక్తంగా సోమవారం దాడులు నిర్వహించారు. అప్పన వీరబాబు ఇంటిలో 25 బ్యాగ్‌లలో సుమారు 920 కేజీల పిడిఎస్ బియ్యంను గుర్తించారు. అలాగే అబ్బూరి శ్రీనివాస్ నివాసంలో 23 బ్యాగ్‌లలో సుమారు 1080 కేజీల బియ్యంను గుర్తించారు. ఈ బియ్యం విలువ రూ.87,400 వరకూ ఉంటుందని, సుమారు 2 వేల కేజీల పిడిఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్థానిక పోలీసులకు రిఫర్ చేశారు. ఈ సందర్భంగా రీజనల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌ఛార్జ్ అధికారి ఎ.సతీష్ బాబు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో పిడిఎస్ బియ్యం అక్రమ నిల్వలు, అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందన్నారు. ఈ తనిఖీల్లో కార్యాలయ ఇన్‌స్పెక్టర్ టి.నాగ వెంకటరాజు, ఎస్ఐ జగన్నాధరెడ్డి, జియాలజిస్ట్ లక్ష్మీనారాయణ, వ్యవసాయ అధికారి భార్గవ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

10 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం ఎస్ఈబి స్టేషన్ పరిధిలో సారా స్థావరాలపై నిర్వహించిన దాడుల్లో మండలంలోని ఉలిమేశ్వరం గ్రామంలో 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, ఒక మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఈబి ఎస్ఐ వై.నాగేంద్రకృష్ణ తెలిపారు. సారా కేసులకు సంబంధించి పెద్దాపురం మండల పరిధిలో 24 మందిపై, జగ్గంపేట మండల పరిధిలో 11 మందిపై, గండేపల్లి మండల పరిధిలో 8 మందిపై బైండోవర్ కేసులు పెట్టి ఆయా మండలాల తహశీల్దార్ కోర్టులలో హాజరుపర్చినట్లు తెలిపారు.

భారీగా మద్యం పట్టివేత

ప్రజాశక్తి-అయినవిల్లి

యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. సిఐ ప్రశాంత్ కుమార్, అయినవిల్లి ఎస్ఐ సురేష్ సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. యానాం నుంచి అయినవిల్లి మీదుగా గుంటూరు మద్యం తరలిస్తున్నట్లు కె.గంగవరానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ కారుతో పట్టుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.లక్ష 40 వేల విలువైన మద్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

విధి నిర్వహణలో బందోబస్తు వెళ్లిన పోలీసు సిబ్బందిపై హత్యాయత్నానికి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. లొల్ల గ్రామంలో పంచాయతీ స్థలాన్ని ఆక్రమించి షెడ్డు నిర్మించడంతో పనులు చేస్తున్న విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి సాయిరాం రెడ్డి పనుల నిలుపుదలకు సంబంధిత వ్యక్తులకు నోటీసు ఇచ్చారు. కానీ పనులు నిలుపుదల చేయకపోవడంతో ఆదివారం పంచాయతీ కార్యదర్శి పోలీసులతో కలిసి పనులను ఆపు చేయాలని లేని పక్షంలో తొలగిస్తామని చెప్పారు. యథావిధిగా పనులు చేయడంతో సోమవారం మధ్యాహ్నం పంచాయితీ కార్యదర్శి మరియు సిబ్బంది, పోలీస్ సిబ్బందితో వెళ్లారు. కల్లూరి మణికంఠ, పెన్మెడి సాయి కృష్ణ అధికారులపై దాడి చేశారు. కానిస్టేబుల్ కెవిని.సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - పెరవలి

మండలంలో పెరవలి 33/11 కెవి విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో ఖండవల్లి ఫీడర్, మల్లేశ్వరం ఫీడర్ మరమ్మతులు, ట్రీ కట్టింగ్‌లో కారణంగా ఖండవల్లి, అన్నవరప్పాడు, పిట్టల వేమవరం, నల్లాకులవారిపాలెం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపేస్తామని ఇఇ బి.వీరభద్రరావు, ఎఇ డేవిడ్ నిక్సల్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోటీ తత్వాన్ని అలవాటు చేసుకోవాలి

ప్రజాశక్తి - తాళ్లపూడి

ప్రతి విద్యార్థి చిన్నతనం నుంచి అన్ని రంగాల్లోనూ పోటీ తత్వాన్ని అలవాటు చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హోం మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని పెద్దేవంలో గల జెడ్‌పి.హెచ్. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు ప్రైజ్ మనీని మంత్రి వనిత అందజేశారు. వైసిపి నాయకుడు తోట రామకృష్ణ కోరిక మేరకు మంత్రి వనిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలుగు ఉపాధ్యాయులు జామి సత్యనారాయణ సంప్రదాయ వేషధారణలో మంత్రికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పలుచోట్ల వికసిత్ భారత్ యాత్ర

ప్రజాశక్తి-గోకవరం

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత భారత్ సంకల్పయాత్ర సోమవారం వెదురుపాక, గుమ్మల్ల దొడ్డి గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిజెపి నాయకులు, అధికారులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గుమ్మల్లదొడ్డి సర్పంచ్ ఎస్.రామలక్ష్మి, ఎంపిటిసి సభ్యులు కె.సూర్యారావు, వెదురుపాక సర్పంచ్ డి.సింగారమ్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం రూరల్



మాట్లాడుతున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

వైసిపి ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు దక్కుతున్నాయని మంత్రి చెల్లుబోయని వేణుగోపాలకృష్ణ తెలిపారు. రాజమహేంద్రవరం రూరల్ ఆల్కాట్ గార్డెన్ మున్సిపల్ కళ్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిఎం జగన్ హామీ మేరకు పింఛన్లను రూ.3వేలకు పెంచారన్నారు. రాజమహేంద్రవరం రూరల్ నియోజక వర్గంలోని 4,313 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. సచివాలయ, వాలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను పేదల ముంగిటకు తీసుకొచ్చారన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల వైద్యాన్ని అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ మాజీ ఎంపిపి రేలంగి వెంకటసత్యనారాయణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమం కోసమే పథకాలు

తాళ్లపూడి : ప్రజల సంక్షేమం కోసమే ప్రభుత్వం పలు పథకానలు అందిస్తుందని హోం మంత్రి తానేటి వనిత అన్నారు. తాళ్లపూడిలోని సలహా సత్యనారాయణ మండపంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో 231 మంది కొత్త లబ్ధిదారులకు, ఇనామీ భూముల్లో ఎప్పటినుండో నివాసముంటున్న మరో 35 మందికి మంత్రి వనిత ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు ఉపయోగం లేని రాద్ధాంతాలు చేస్తున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జడ్‌పి వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ, వైసిపి మండల అధ్యక్షుడు కాకర్ల వెంకటేశ్వరరావు, నాయకులు రామకృష్ణ పాల్గొన్నారు.

'వడ్డే'ను కలిసిన 'గన్ని'

రాజమహేంద్రవరం : మాజీ మంత్రి, ఎంపీ వడ్డే శోభనాద్రీశ్వరరావును టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ సోమవారం కలిశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఎఐకెఎస్ 18వ రాష్ట్ర సభలకు హాజరయ్యేందుకు ఆయన రాజమహేంద్రవరం వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను హోటల్ రివర్ బేలో గన్ని కృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులుపై చర్చించుకున్నారు.

పలు చోట్ల ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఉంగ్రాజవరం, గోపాలపురం, పెరవలి

ఉచిత బస్సు ప్రయాణాల వల్ల తాము ఉపాధిని కోల్పోతామంటూ పలుచోట్ల ఆటో కార్మికులు నిరసనలు తెలిపారు. చివటంలో అమ్మ ఆటో యూనియన్, ఫ్రెండ్స్ ఆటో వర్కర్స్ అండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆటోలను నిలిపేసి నిరసన తెలిపారు. గోపాలపురం మండలం దొండపూడిలో ఆటో డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ తేలే వెంకటేష్, బోర్డు సభ్యులు కొలుకుల వెంకటేష్ ,కలపాల విజయ్ చందర్, కొక్కిరిపాటి రాజేష్ తదితరులు పాల్గొన్నారు. పెరవలి మండలం అన్నవరప్పాడు జాతీయ రహదారిపై జిల్లా ఆటో యూనియన్ ఆదేశాల మేరకు నవ్య లక్ష్మి ఆటో ఓనర్స్ డ్రైవర్లు యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నవరప్పాడు పిట్టల వేమవరం కడింపాడు తదితర గ్రామల ఓనర్స్ డైవర్స్ పాల్గొన్నారు

బాలలను పనిలో పెట్టుకుంటే జైలుకే

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ఎవరైనా 18 ఏళ్లలోపు బాలలను పనిలో పెట్టుకుంటే జైలు శిక్ష తప్పదని ఎస్‌పి పి.జగదీష్ హెచ్చరించారు.'ఆపరేషన్ స్వేచ్ఛలో' భాగంగా ఈ నెల 5 నుంచి 11వరకూ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోలీసులు, చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్, ఇతర శాఖల ఆధ్వర్యంలో జిల్లాలో అవగాహనా కార్యక్రమాలను నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రదేశాల్లో దిశ పోలీస్ స్టేషన్ సిఐ రమణమ్మ, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ల బృందం తనిఖీలు చేశారని ఎస్‌పి తెలపిఆరు. బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే 100కు లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్, చైల్డ్ లేబర్ డిపార్ట్‌మెంట్, డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీకి సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు సూచించారు.

పలువురికి నెహ్రూ పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

మండలంలోని రంప యర్రంపాలేంలో పలువురిని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ సోమవారం పరామర్శించారు. ఉంగరాల బోడ్డియ్య తనయుడు అబ్బాయి కాశి ఇటీవలే రోడ్డుప్రమాదంలో గాయపడ్డాడు. అదే గ్రామానికి చెందిన నవనాసి వెంకటేష్ ఆపరేషన్ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. వీరిని జ్యోతుల పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే పప్పు మాణిక్యం, సీతారాం, దర్శిపూడి సత్యభామ ఇటీవల మృతి చెందారు. వారి కుటుంబాలను పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట ఎస్‌విఎస్.అప్పలరాజు, ఉంగరాల రాము, బాదంపూడి ప్రకాష్, ఉంగరాల గణేష్, నారా ప్రసాద్, నవనాసి గణపతి, యర్ర రాంబాబు, చీకట్ల శ్రీను, నోట్ల నూకరాజు, గంటా చంద్రరావు, ఆది రవి పాల్గొన్నారు.


సంతాపం తెలుపుతున్న నెహ్రూ

యానాం వార్తలు



ముగిసిన ప్రజా ఉత్సవాలు

ప్రజాశక్తి - యానాం

పుదుచ్చేరి పర్యాటక, రైతు సంక్షేమ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు స్థానిక బాలయోగి క్రీడా మైదానంలో నిర్వహించిన 20వ యానాం ప్రజా ఉత్సవాలు, 22వ ఫల పుష్ప ప్రదర్శన సోమవారం రాత్రితో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమాలను ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావులు పర్యవేక్షించారు. వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు చేసిన ప్రత్యేక నృత్యాలు అందరినీ అలరించాయి. చివరి రోజైన సోమవారం ప్రముఖ సినీ గాయకులచే సినీ ఆర్కెస్ట్రా, రాముా మార్వాడి గ్రూప్ చేసిన ప్రత్యేక కార్యక్రమం, మిమిక్రీ ప్రజలను అలరించాయి. అనంతరం యానాంలో నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన కళాకారుల ప్రదర్శనలు నిర్వహించారు. ఉత్సవాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావడంతో బాలయోగి క్రీడా మైదానం జనసంద్రంగా మారింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అరుల్ ప్రగాశం, వ్యవసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ శివ సుబ్రహ్మణియన్ వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ రఘునాయిగం నేతృత్వంలో సిఐ షణ్ముగం, ఎస్ఐలు శేరు నూకరాజు, కట్టా సుబ్బరాజు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశారు.



రీజెన్సీ స్కూల్లో సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - యానాం

మెట్టకూరులోని రీజెన్సీ పాఠశాలలో ముందస్తుగా సంక్రాంతి సంబరాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. రంగవల్లులతో, బొమ్మల కొలువులతో పాఠశాల ప్రాంగణాన్ని పల్లెదనం ఉట్టిపడేలా తీర్చిదిద్దారు. గాలిపటాల ఎగురవేత, గొబ్బెమ్మలు, కోలాటం, హరిదాసుల వేషధారణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ఆవరణలో భోగిమంటలు వేశారు. ముగ్గుల పోటీలను నిర్వహించారు. సుమారు 60 మంది విద్యార్థినులు 10 మంది మహిళా ఉపాధ్యాయులు ఎంతో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం టివిఎస్ఎస్‌వి.ప్రసాదరావు మాట్లాడుతూ విద్యార్థులకు పండగల విశిష్టత, సంప్రదాయాలు గురించి అర్థమయ్యేలా వివరించడం కోసమే ముందస్తు సంక్రాంతి సంబరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పుదుచ్చేరి ప్రభుత్వం వ్యవసాయ శాఖ 22వ ఫల పుష్ప ప్రదర్శనలో భాగంగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో రీజెన్సీ విద్యార్థినులు కె.భవ్యసృజన మొదటి బహుమతిని, వై.సాయిశ్రావ్య, ఎం.సుమాంజలి, ఎ.సుస్మితలు కన్సలేషన్ బహుమతులు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ చెక్కల వీరభద్రరావు, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - కిర్లంపూడి

సాగు చేసిన పంటలకు నీరు అందించలని డిమాండ్ చేస్తూ రైతులు కిర్లంపూడి నీటి పారుదల శాఖ సెక్షన్ కార్యాలయం వద్ద రైతులు ఆందోళన చేపట్టారు. పిఠాపురం రూరల్ మండలంలోని గోకివాడ, జగపతిరాజపురం రైతులు సాగు చేసిన 200 ఎకరాలపైగా ఆయకట్టుకు నీటిని విడుదల చేయాలని పలు దఫాలుగా నీటి పారుదల శాఖ అధికారులకు మొరపెట్టుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో సోమవారం కిర్లంపూడి సెక్షన్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఏలేరు నుంచి వచ్చే నీటిని దిగువకు విడుదల చేయాలని ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టు కున్నా నీరు తక్కువగా ఉందని కుంటి సాకులు చెబుతూ అధికారులు తప్పించుకుంటున్నారని ఈ సందర్భంగా రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నీరు విడుదల చేయకపోవడంతో భూములు బంజరు భూములుగానే మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే నారు వేసి 35 రోజులు అయ్యిందని, నీరు లేక మడులు ఎండిపోతున్నాయని తెలిపారు. ఇప్పటికైన నీటి పారుదల శాఖ అధికారులు స్పందించి తక్షణమే నీరు విడుదల చేసి రబీ సాగును కాపాడాలని రైతు మడికి బాబ్జీ కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు మాసా మోషే, ఏసుబాబు, పెద్దకాపు, రామకృష్ణ తదితర రైతులు పాల్గొన్నారు.


నీటిపారుదల శాఖ సెక్టార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నేడు వైసిపి దళిత నాయకుల ఆత్మీయ సమావేశం

ప్రజాశక్తి - కడియం

వైసిపి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారిన నేపథ్యంలో దళిత నాయకులు మంగళవారం ఆత్మీయ సమావేశానికి పిలుపునిచ్చారు. సోమవారం వేమగిరి అంబేద్కర్ పార్క్‌లో దళిత ముఖ్య నాయకులు యాదల సతీష్‌చంద్రస్టాలిన్, బడుగు ప్రశాంత్‌కుమార్, పెయ్యల రాజేష్, విప్పర్తి ఫణికుమార్ తదితరులు సమావేశమయ్యారు. మంగళవారం ధవలేశ్వరం జక్కంపూడి సీతారత్నం కళ్యాణ మండపంలో ఈ సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమానికి వైసిపి నియోజవర్గ ఇన్‌ఛార్జి, మంత్రి వేణుగోపాలకృష్ణను ఆహ్వానించి వారి సమస్యలను వివరించాలని నిర్ణయించుకున్నారు. పార్టీ జెండా భుజాన వేసుకున్న దళితులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని మంత్రి వేణును కోరతామన్నారు. ఈ సమావేశంలో దళిత నాయకులు తలారి ప్రసాద్, గోలి దేవా, డి.హరీష్, సిహెచ్.చిన్న, కె.రాజు, ఎన్‌వి.శేఖర్, పి.సునీల్ తదితరులు పాల్గొన్నారు.


బట్టికి స్వాగతం పలుకుతున్న మంత్రి పినిపే విశ్వరూప్

తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టికి ఘన స్వాగతం

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కుకు కాకినాడలో ఘన స్వాగతం లభించింది. ఒక వివాహ కార్యక్రమం నిమిత్తం ఆయన సోమవారం రాత్రి కాకినాడ వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్అండ్ బి అతిథి గృహంలో రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్, మాజీ ఎంపి లగడపాటి రాజగోపాల్ తదితరులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంతసేపు స్థానిక రాజకీయ పరిస్థితులపై వారు మాట్లాడుకున్నారు. అనంతరం ఎస్ఆర్ఎంటి ఫంక్షన్ హాల్‌లో వివాహ వేడుకలో పాల్గొన్నారు. అలాగే ఆదిత్య విద్యాసంస్థలను ఆయన సందర్శించారు. ఆదిత్య విద్యాసంస్థల అధినేత నల్లమిల్లి శేషారెడ్డి, మాజీ మంత్రి తోట నరసింహం ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

అల్లర్ల కేసుల ఉపహంహరణపై ధర్నా

ప్రజాశక్తి-అమలాపురం

అమలాపురంలో అల్లర్ల కేసులను ప్రభుత్వం ఎత్తివేసే సందర్భంగా విడుదల చేసిన జిఒను వెంటనే వెనక్కి తీసుకోవాలని దళిత ఐక్యవేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అమలాపురం గడియార స్తంభం సెంటర్లో సోమవారం నిరసన తెలిపారు. నేరస్తులను ప్రభుత్వం కాపాడడం సిగ్గుచేటు అంటూ నినాదాలు చేశారు. అల్లర్ల ఘటనలో అందరూ నిర్దోషులైతే మరి అసలు ఘటనకు కారకులు ఎవరని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే జిఒను వెనక్కి తీసుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. డిబి.లోక్, గెడ్డం సురేష్ బాబు, పెయ్యల పరశురాముడు, జంగా బాబూరావు, మెండు రమేష్ బాబు, గూటం సాయి, ఉబ్బన శ్రీను, నక్కా సంపత్, రేవు తిరుపతిరావు, గంటి చిరంజీవి, బొంతు రమణ ఉన్నారు.

ఆదిత్యలో జాతీయ స్థాయి సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - గండేపల్లి


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

నరాంపాలెం ఆదిత్య విద్యా ప్రాగణంలో గల ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కళాశాల, ఫోరెన్సిక్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఫోరె న్సిక్ వివిధ నూతన ఆన్వే షణ పద్ధతులు మరియు వాటి అధ్యయనం అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ స్థాయి సదస్సు సోమవారం ప్రారంభం అయ్యింది. ఆదిత్య అధినేత డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏలూరు రేంజ్ ఐజి జివిజి అశోక్ కుమార్, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ రిటైర్డ్ జనరల్ మేనేజర్ ఎం.నాగి రెడ్డి పాల్గొని జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఐజి అశోక్ కుమార్ మాట్లాడుతూ నేర ఆన్వేషణ లో ఫోరెన్సిక్ శాఖ, పోలీస్ శాఖ కు చాలా కీలకమైందన్నారు. అటువంటి ఫోరెన్సిక్ సైన్స్ కోర్స్‌ను ప్రాథమిక విద్య నుంచి డిగ్రీ వరకు మన ఆంధ్ర రాష్ట్రంలో ఆదిత్య విద్యా సంస్థలో ఉండటం గర్వకారణమన్నారు. ప్రస్తుత సమాజం నేరాలు మరియు ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా తీసుకోవాలిసిన జాగ్రత్తలు, నేర ఆన్వేషణ ఏ విధంగా ఛేదించాలి అనే అంశాలను వివరించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ పలు యూనివర్శిటీలకు చెందిన ప్రొఫెసర్లు, ఆదిత్య విద్యా సంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్ రెడ్డి, ప్రిన్సిపల్ విలాస్ అనీల్ చవాన్, జగ్గంపేట సిఐ, తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి - అన్నవరం, పెద్దాపురం

ప్రభుత్వం ఇటీవల తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నవరంలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుల్లయ్య మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రజ లకు, న్యాయవాదులకు తీవ్రమైన నష్టం జరుగుతుందన్నారు. ఈ చట్టం వల్ల జరిగే న ష్టం గురించి ప్రజలు అవగాహన తెచ్చుకోవా లని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ సభ్యులు బి.మధు, జొన్నాడ రాజేష్. రాయి శ్రీను, న్యాయవాదులు బి.జాన్‌బాబు, బి.చలం పాల్గొన్నారు. పెద్దాపురంలో ఎపి భూ హక్కు చట్టాన్ని నిరసిస్తూ ఆల్ ఇండియా లాయర్స్ అసోసి యేషన్ ఫర్ జస్టిస్ ఆధ్వర్యంలో న్యాయ వాదులు కోర్టుల వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్రహ్మణ్యం(మణి) మాట్లాడుతూ ప్రజలకు అన్యాయం జరిగే ఎపి భూహక్కుల చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జి.సత్య నారాయణ, కె.రాయుడు, పి.విజయ్ కుమార్, ఎస్.నరసింహారావు, డివిఎస్ఎస్ రామచంద్ర రావు, మడికి రాంబాబు, రాగం కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.